ముగిసిన గ్రూప్-2 పరీక్షలు

కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

గ్రూప్-2 పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, డిసెంబర్ 16 : జిల్లాలో రెండు రోజులపాటు ప్రశాంత వాతావరణంలో నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు సోమవారం ముగిసినట్లు ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. జిల్లాలోని 85 కేంద్రాల్లో పరీక్షలు సజావుగా జరిగాయని, కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించామని, ప్రతీ కేంద్రం వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అంతకుముందు కలెక్టర్ ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్-2 పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసి.. పరీక్ష తీరును పరిశీలించారు. ప్రతి అభ్యర్థికి ప్రత్యేకంగా ఓఎంఆర్ షీట్‌లను పబ్లిక్ సర్వీస్ కమిషన్ తయారు చేసిందని, పరీక్షకు అభ్యర్థి రాకపోయినా అతడి బెంచ్‌పై ఓఎంఆర్ షీట్ పెట్టారో.. లేదో.. కలెక్టర్ తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

వినతులను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం, డిసెంబర్ 16: ప్రజావాణిలో వచ్చిన వినతుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఐడీవోసీలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజతో కలిసి ప్రజల నుంచి విజ్ఞప్తులు స్వీకరించిన ఆయన.. వాటిని నిశితంగా పరిశీలించారు. వాటి పరిష్కారం కోసం వాటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేశారు. ఈ సందర్భంగా పలువురు అర్జీదారులు తమ వినతులను సమర్పించారు. జిల్లా అధికారులు సన్యాసయ్య, రాజేశ్వరి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

బీమా ప్రీమియాలపై జీఎస్టీ తగ్గిస్తారా?: ఎంపీ

ఖమ్మం, డిసెంబర్ 16: 'జీవిత, ఆరోగ్య బీమాల ప్రీమియాలపై జీఎస్టీ భారాన్ని తగ్గిస్తారా? పన్నుల రూపంలో లాభాపేక్ష లేకుండా వినియోగదారుల పక్షాన ప్రత్యేక ప్రణాళికను ఏమైనా రూపొందిస్తారా?' అని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా సోమవారం జరిగిన సభలో ఆయన ఈ ప్రశ్నలు లేవనెత్తారు. ఇందుకు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ దరి స్పందించి లిఖిత పూర్వక సమాధానమిచ్చారు. జీవోఎం నుంచి పూర్తిస్థాయి నివేదిక వచ్చిన తర్వాతే ఈ అంశంపై స్పష్టత వస్తుందని సమాధానమిచ్చారు.

నెలాఖరు వరకూ 'ఇళ్ల' విచారణ: మేయర్

ఖమ్మం, డిసెంబర్ 16: ఈ నెల ఆఖరు వరకూ ఇందిరమ్మ ఇళ్ల విచారణ జరుగుతుందని కేఎంసీ మేయర్ నీరజ తెలిపారు. అధికారులు విచారణకు వచ్చిన సమయంలో ఇళ్ల వద్ద లేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వీరి కోసం అధికారులు మరోసారి విచారణకు వస్తారని వివరించారు. కేఎంసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె పాల్గొని పలువురు అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. కేఎంసీ అధికారులు మహమ్మద్ షఫీ ఉల్లా, విజయానంద్, వసుంధర, మాధవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

19న జిల్లాస్థాయి బాలబాలికల కబడ్డీ ఎంపికలు

ఖమ్మం సిటీ, డిసెంబర్ 16: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఖమ్మం పటేల్ స్టేడియంలో 50వ జూనియర్ బాలబాలికల కబడ్డీ ఎంపికలు జరుగుతాయని అసోసియేషన్ కార్యదర్శి కటికల క్రిష్టఫర్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఎస్ఎస్‌సీ మెమో లేదా వయసు ధ్రువీకరణపత్రం తీసుకురావాలన్నారు. బాలురు 70 కేజీలు, బాలికల 65 కేజీల బరువులోపు ఉన్నవారే అర్హులని పేర్కొన్నారు. బాలికల జట్టుకు ఎంపికైన వారిని ఈ నెల 22 నుంచి 25 వరకు మేడ్చల్‌లో జరిగే అంతర్ జిల్లా పోటీలకు పంపిస్తామన్నారు. అదేవిధంగా బాలుర జట్టుకు ఎంపికైన వారు ఈ నెల 27 నుంచి 30 వరకు జనగామ జిల్లాలో జరుగనున్న 50వ జూనియర్ అంతర్ జిల్లా కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. పూర్తి వివరాలకు 7396669337 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో 'సెమీ క్రిస్మస్'

ఖమ్మం, డిసెంబర్ 16: క్రైస్తవులు అత్యంత పవిత్రంగా ఆచరించే క్రిస్మస్ పర్వదినం సందర్భంగా స్థానిక టీఎన్‌జీవోస్ ఫంక్షన్ హాల్లో ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ వేడుకలకు క్రైస్తవ కుటుంబాల ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. క్రిస్మస్ పండుగ శాంతికి ప్రతీక అని అన్నారు. సంఘం నాయకులు ఏలూరి శ్రీనివాసరావు, దేవరకొండ సైదులు, కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రి పాల్గొన్నారు.

రేపట్నుంచి సత్తుపల్లిలో జిల్లా మహాసభలు: సీపీఎం

ఖమ్మం కమాన్‌బజార్, డిసెంబర్ 16: ఈ నెల 18,19 తేదీల్లో సత్తుపల్లిలో తమ సీపీఎం జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మహాసభలకు పార్టీ అగ్రనేతలతోపాటు సుమారు 600 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు వివరించారు. ఈ సభలను విజయవంతం చేయాలని కోరారు. పార్టీ నాయకులు ఎర్రా శ్రీకాంత్, కల్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేశ్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక

రంజాన్, నాగేశ్వరరావు, కోటేశ్వరరావు

సత్తుపల్లి/ఖమ్మం ఎడ్యుకేషన్/ఎర్రుపాలెం/కొణిజర్ల, డిసెంబర్16: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా 6వ మహాసభలు పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో శని, ఆదివారం జరిగాయి. ఈ మహాసభల్లో రాబోయే రెండు సంవత్సరాలకు గాను నూతన కమిటీను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు చావా దుర్గాభవానీ పరిశీలకులుగా, రాష్ట్ర కార్యదర్శి బీ రాజు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. జిల్లా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా షేక్ రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బుర్రి వెంకన్న, షమీ, కోశాధికారిగా వల్లంకొండ రాంబాబు, కార్యదర్శులుగా ఎం నర్సయ్య, డీ నాగేశ్వరరావు, వీవీ రామారావు, నిర్మలకుమారి, సురేశ్, రాందాస్, నాగుర్‌వలీ, ఉద్దండు షరీఫ్, పద్మ, రోజా, రామకృష్ణ, కోటేశ్వరరావు, ఉమామహేశ్వరరెడ్డి, విజయ్‌కుమార్, సుధాకర్‌రావును ఎన్నుకున్నారు. వీరితో పాటు జిల్లా కమిటీ సభ్యులుగా 119 మంది, ఆఫీస్ బేరర్లుగా 19 మంది, ఆడిట్ కమిటీ సభ్యులుగా అయిదుగురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైనా సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

రైతులను మోసం చేస్తే పుట్టగతులుండవ్: బాగం

రఘునాథపాలెం: ఆందోళన చేస్తున్న రైతు సంఘం నాయకులు, కూసుమంచి: తహసీల్దార్ కార్యాలయం ఎదుట, బోనకల్లు: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రఘునాథపాలెం, డిసెంబర్ 16: రైతులను మోసగించిన ప్రభుత్వాలకు పుట్టగతులుండవని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు స్పష్టం చేశారు. అర్హులైన రైతులందరికీ తక్షణమే రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. అనేకమంది రైతులకు రుణమాఫీ జరగనప్పటికీ జరిగినట్లుగా ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శించారు. సీపీఐ నేతలు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

బోనకల్లులో..

బోనకల్లు, డిసెంబర్16: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలుపుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం(ఏఐకేఎస్) ఖమ్మం జిల్లా కార్యదర్శి జక్కుల రామారావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు తోట రామాంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షలు పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించి దశల వారీగా కొంతమందికి మాఫీ చేసిందని, జిల్లాలో ఇంకా అనేక మందికి రూ.2 లక్షల లోపు రుణాలు ఉన్నా మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సహాయ కార్యదర్శి ఆకెన పవన్, నాయకులు గుడిదే కృష్ణ, బొడ్డపల్లి వెంకటేశ్వర్లు, చావా నాగయ్య, గుంపుల జయరాజు, కొంగర భాస్కర్‌రావు, రైతులు గొల్లపల్లి కృష్ణారావు, నాగుల్‌మీరా, షేక్ సోందు పాల్గొన్నారు.

కూసుమంచిలో..

కూసుమంచి, డిసెంబర్ 16: ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం రూ.2 లక్షలలోపు రుణమాఫీ చేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో రైతు సంఘం నాయకులు సోమవారం కూసుమంచి, నేలకొండపల్లి తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సంఘం అధ్యక్షుడు రామ్మూర్తి నాయక్, మల్లేశ్, నర్సింహా, శ్రీకాంత్, అరుణ, వీరబాబు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెంలో..

తిరుమలాయపాలెం, డిసెంబర్ 16: రైతులందరికీ రూ.2లక్షలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్, సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం బస్టాండ్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు రైతులు ప్రదర్శన నిర్వహించి ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేశ్, మండల కార్యదర్శి బత్తుల రాధకృష్ణ, పగిళ్ల వీరభద్రం, ఇంటూరి వెంకటేశ్వర్లు, దంతాల బాలరాజు, బీఆర్ఎస్ నాయకులు పోలెపొంగు వెంకటేశ్వర్లు, గంట కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లిలో..

కారేపల్లి, డిసెంబర్ 16: అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయాలని ఏఐకేఎంఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో సోమవారం కారేపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తాటి వెంకటేశ్వర్లు, తాతా వెంకన్న, ఉంగరాల సుదాకర్, బట్టు సంఘయ్య, మర్ల వెంకటరెడ్డి, పండగ వెంకటేశ్వర్లు, గుగులోత్ మాంగు, ఇస్లావత్ బావ్‌సింగ్ పాల్గొన్నారు.

కొణిజర్లలో..

కొణిజర్ల, డిసెంబర్ 16: రైతు రుణమాఫీ, రైతు భరోసాను తక్షణమే అమలు చేయాలని సోమవారం సీపీఐ, రైతుసంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జి యర్రబాబు, పీవీ రావు, స్వర్ణ రమేశ్, తోటపల్లి సీతారాములు, తండు సోమయ్య, గడల శ్రీను, కొమ్మిన వెంకయ్య, సైదులు, కడప బాబు, ఎర్ర కేశవులు, బండారు పుల్లయ్య, తిప్పతి రామారావు, రజాక్, దడిపిన్ని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

1 నుంచి ఏపీజీవీబీ తెలంగాణ బ్యాంక్‌గా మార్పు

గ్రామీణ బ్యాంక్ భవనాన్ని ప్రారంభిస్తున్న జీఎం దయాకర్, ఆర్ఎం రియాజ్

కూసుమంచి, డిసెంబర్ 16: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ జనవరి 1వ తేదీ నుంచి తెలంగాణ బ్యాంక్‌గా మార్పు చేయటం జగుతుందని బ్యాంక్ జీఎం దయాకర్ అన్నారు. సోమవారం మండలంలోని పాలేరులో బ్యాంకు నూతన భవనాన్ని ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణలో తెలంగాణ బ్యాంక్‌గా మాత్రమే పిలువ బడుతుందని, మిగిలిన సేవలన్నీ యధాతదంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆర్ఎం మహ్మద్ రియాజ్, ఎస్ఎం ఆపరేషన్ ప్రకాశ్, డీజీఎం ప్రదీప్, ఏవో నాగరాజు, పాలేరు, కూసుమంచి మేనేజర్లు ఉపేందర్, ఉప్పయ్య పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలి

మాట్లాడుతున్న నాగేశ్వరరావు

సత్తుపల్లి, డిసెంబర్16: సింగరేణిలో ప్రతి ఉద్యోగి రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి సాధించాలని రక్షణ వారోత్సవ కమిటీ కన్వీనర్ జీఎంఆర్ నాగేశ్వరరావు అన్నారు. సోమవారం కిష్టారం ఓసీలో రక్షణ వారోత్సవాల కమిటీ సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన బొగ్గు గనిలో తీసుకోవాల్సిన రక్షణ చర్యలు, ప్రమాదాలను చేపట్టాల్సిన చర్యలపై కార్మికులకు వివరించారు. అనంతరం ట్రేడ్ టెస్టులో గెలుపొందిన ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కిష్టారం ఓసీ పీవో నర్సింహారావు, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సముద్రాల సుధాకర్, ఐఎన్‌టీయూసీ ఫిట్ సెక్రటరీ బాలాజీ, రక్షణ వారోత్సవ కమిటీ సభ్యులు సునీల్‌వర్మ, రామకృష్ణ, లక్ష్మీరాజ్, భాస్కర్, లోకనాథ్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, రమణారావు, మేనేజర్ రామకృష్ణ, రక్షణ అధికారి గోపి, సంక్షేమ అధికారి విజయసందీప్ పాల్గొన్నారు.

సిబ్బంది సమయ పాలన పాటించాలి

ముదిగొండ, డిసెంబర్ 16: వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సైదులు అన్నారు. ముదిగొండలోని పీహెచ్‌సీని సోమవారం ఆయన సందర్శించారు. ఆయన సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండాలనీని, మందుల ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని అన్నారు. ల్యాబ్ పరికరాలు పనిచేస్తున్నాయో లేదో చూసుకోవాల న్నారు. అనంతరం రికార్డులు, ల్యాబ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో మధుసూదన్, సిబ్బంది సత్యావతి, నాగరాజుకుమారి, రామారావు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషి చేయాలి

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 16: ఆరోగ్యవంతమైన సమాజం కోసం కృషిచేయాలని, దీంతోనే దేశ సర్వతోముఖాభివృద్ధి సాధ్యమని జిల్లా కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారి యలగందుల రాజశేఖర్ అన్నారు. ఖమ్మంలోని మహిళా ప్రాంగణంలో 'స్కూల్ హెల్త్ అండ్ వెల్‌నెస్ ప్రోగ్రాం'పై జరుగనున్న రెండు రోజుల జిల్లా స్థాయి రిసోర్స్‌పర్సన్‌ల శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వైద్యారోగ్య, విద్యాశాఖ సంయుక్తంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో శిక్షణ పూర్తయిందని, ప్రస్తుతం రెండు రోజులు పాటు వైద్య ఆరోగ్య శాఖ నుంచి నలుగురు, జిల్లా విద్యాశాఖ నుంచి నలుగురు ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొంటారని పేర్కొన్నారు. శిక్షణ శిబిరాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి, ఇమ్యూనైజేషన్ అధికారి బాలకృష్ణ సందర్శించారు. ఆర్‌పీలు చందన, స్రవంతి, బాలకృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్యదర్శి వెంకటరమణపై చార్జ్ మెమో జారీ

రఘునాథపాలెం, డిసెంబర్16: మండలంలోని పాపటపల్లి గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహించిన వెంకటరమణకు డీపీవో చార్జ్ మెమో జారీ చేసినట్లు ఎంపీవో శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రస్తుతం సత్తుపల్లి మండలం కిష్టారం గ్రామ కార్యదర్శిగా పని చేస్తున్న వెంకటరమణ పాపటపల్లిలో పనిచేస్తున్న సమయంలో పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నాడు. ఈ మేరకు గ్రామానికెళ్లి విచారణ చేపట్టిన ఎంపీవో నివేదికను ఉన్నతాధికారులు అందజేశారు. దీనిపై డీపీవో కార్యదర్శి వెంకటరమణపై పూర్తి విచారణ నిమిత్తం చార్జ్ మెమో దాఖలు చేసినట్లు తెలిపారు. విచారణ అనంతరం గ్రామంలో పలువురి వద్ద అక్రమంగా వసూలు చేసిన నగదును రికవరీ చేయడం జరుగుతుందని ఎంపీవో తెలిపారు.

గొల్లగూడెంలో ఇరువర్గాల ఘర్షణ

రఘునాథపాలెం, డిసెంబర్ 16: ఖమ్మం నగరం గొల్లగూడెం హిందూ స్మశాన వాటిక వద్ద ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. గొల్లగూడెనికి చెందిన వ్యక్తి చనిపోవడంతో స్మశాన వాటిక వద్ద దహన సంస్కారాలు చేసేందుకు తీసుకెళ్లారు. అయితే షేక్ బాబు అనే వ్యక్తి అడ్డుకునే ప్రయత్నం చేశాడు. దీంతో స్మశాన వాటిక స్థలాన్ని షేక్ బాబు కబ్జా చేశాడంటూ ఇరు వర్గాలు ఘర్షణ పడ్డాయి. దీంతో స్థానికులు జోక్యం చేసుకొని ఇరువర్గాలను సముదాయించారు.

20న ఈజీఎస్ ప్రజావేదిక

సత్తుపల్లి, డిసెంబర్ 16: ఈనెల 20వ తేదీ ఉదయం 9:00 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహిస్తామని ఎంపీడీవో చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. ఈజీఎస్ సిబ్బం ది, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని కోరారు.

ఆటలపై మక్కువ పెంచుకోవాలి

డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి, డీపీఆర్వో గౌస్‌పాషా

ప్రారంభమైన జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి

ఖమ్మం సిటీ, డిసెంబర్ 16 : విద్యార్థి దశ నుంచే ఆటలపై మక్కువ పెంచుకుంటే ఉన్నతస్థాయికి ఎదగవచ్చని జిల్లా యువజన, క్రీడల అధికారి తుంబూరు సునీల్‌రెడ్డి అన్నారు. ఖమ్మం నగరంలోని పటేల్ స్టేడియంలో జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలు సోమవారం అట్టహాసంగా ఆరంభమయ్యాయి. డీపీఆర్వో గౌస్ పాషాతో కలిసి డీవైఎస్‌వో జ్యోతి ప్రజ్వలన గావించి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే 2028 ఒలింపిక్స్ నాటికి తెలంగాణ నుంచి పతకాలు సాధించే క్రీడాకారులను తయారు చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామ, మండల, పట్టణ స్థాయి పోటీల్లో వివిధ క్రీడాంశాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారే జిల్లాస్థాయి పోటీలకు వచ్చారన్నారు. కార్యక్రమంలో వివిధ క్రీడా అసోసియేషన్‌ల సెక్రటరీలు క్రిష్టఫర్ బాబు, నరసింహమూర్తి, డాక్టర్ రఘునందన్, ఎండీ షఫీ, శ్రీనివాసరావు, సాంబమూర్తి, రాము, ఎండీ అక్బర్ అలీ, కోచ్‌లు పరిపూర్ణాచారి, హరీశ్, చంద్రకాంత్, నగేశ్, కొండలరావు, కైలాష్, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు. కాగా.. కరాటే, టేబుల్ టెన్నీస్, స్విమ్మింగ్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, వాలీబాల్, రెజ్లింగ్ పోటీలకు జిల్లాలోని అన్ని గ్రామ, మండల, పట్టణ స్థాయి పోటీల్లో గెలుపొందిన పురుషులు, మహిళలు కలిపి మొత్తం 870 మంది క్రీడాకారులు హాజరు కావడం గమనార్హం. అత్యధికంగా కబడ్డీ కోసం 333 మంది, వాలీబాల్ కోసం 326 మంది క్రీడాకారులు పోటీ పడుతున్నారు.

బీబీసీ కెనాల్‌కు తగ్గిన నీటి సరఫరా

పంట తడులకు నీరందక సాగు రైతుల అవస్థలు

మండలంలోని బీబీసీ కెనాల్‌లో తక్కువగా ప్రవహిస్తున్న నీరు

బోనకల్లు, డిసెంబర్ 16 : మండలంలోని బోనకల్లు బ్రాంచ్ కెనాల్(బీబీసీ)కి నీటి సరఫరా తగ్గిపోవడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రసుతం సాగు చేస్తున్న వేలాది ఎకరాలకు నీరందకపోవడంతో నిస్సహాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. బీబీసీ కెనాల్ పరిధిలో వేలాది ఎకరాల్లో రైతులు వరి, మిర్చి, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేస్తున్నారు. ప్రస్తుతానికి మొక్కజొన్న పైరు ఎదుగుదలలో ఉండడం.. మిర్చి తోటలకు తడులు అందకపోవడంతో ఎండిపోతాయని దిగులు చెందుతున్నారు. మండలంలోని బీబీసీ కెనాల్ నుంచి కలకోట, ఆళ్లపాడు, నారాయణపురం, పోలంపల్లి, ముష్టికుంట్ల వంటి మైనర్ కాల్వ తూములకు సక్రమంగా నీరు అందకపోవడంతో ఆయా ప్రాంతాల రైతులు ఆందోళన చెందుతున్నారు. బోనకల్లు, రావినూతల, గోవిందాపురం-ఎ, చిరునోముల, ముష్టికుంట్ల, పెద్దబీరవల్లి, జానకీపురం గ్రామాలకు చెందిన రైతాంగం మొక్కజొన్న, పత్తి వేలాది ఎకరాల్లో సాగు చేశారు. కెనాల్‌కు ఐదు రోజులుగా నీటి సరఫరా తగ్గించడంతో ఆవేదన చెందుతున్నారు. దీనిపై ఇరిగేషన్ సబ్ డివిజన్ ఈఈ తమ్మారపు వెంకటేశ్వర్లు వివరణ కోరగా.. పాలేరు జలాశయంలో నీటి నిల్వలు తగ్గడంతో బీబీసీ కాల్వకు నీటి సరఫరా తగ్గించారని తెలిపారు. ఒకటి, రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో నీటి సరఫరా చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతానికి వారబందీ షెడ్యూల్ విడుదల కాలేదని, రైతులకు కావాల్సిన నీటి అంశాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తామని వివరించారు.

త్వరగా ధాన్యం కాంటాలు చేపట్టాలి

వేంసూరు, డిసెంబర్16: సొసైటీ, ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు జరగక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, త్వరగా ధాన్యానికి కాంటాలు వేయాలని తెలంగాణ రైతుసంఘం మండల అధ్యక్షుడు కొత్త సత్యనారాయణ అన్నారు. సోమవారం రైతుసంఘం ఆధ్వర్యంలో ప్రజావాణిలో తహసీల్దార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మిల్లర్లు తరుగు పేరుతో 40కేజీల టిక్కీకి రెండు కేజీలు ఎక్కువగా కాంటా లు నిర్వహిస్తున్నారని రైతులు వాపోతున్నారన్నారు. మండలంలోని ఆరు సొసైటీల పరిధిలో కేవలం 32 వేల బస్తాలే కాంటాలు వేయటమే జరిగిందని, ఇంకా 60వేల బస్తాలు కాంటాలు వేయాల్సి ఉందన్నారు. వేంసూరు సొసైటీలో ఎత్తిన వేల బస్తాలకు తరుగు లేకుండా తమకు నగదు ఇప్పించాలని అధికారులను వారు డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో అరవపల్లి జగన్మోహన్‌రావు, కొత్త అప్పారావు, రావి సత్యనారాయణ, బేతిని చెన్నయ్య, బొంతు భాస్కరరావు, నాగ రమేశ్, భాస్కర్‌రావు పాల్గొన్నారు.

'అమ్మ-నాన్నలకు' వందన కార్యక్రమం

సత్తుపల్లిటౌన్, డిసెంబర్ 16: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో యూటీఎఫ్ ఏర్పాటు చేసిన అమ్మ- నాన్నలకు వందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్ పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులే విద్యార్థులకు మొదటి గురువులని, తల్లిదండ్రులను గౌరవించినప్పుడే సమాజంలో మనకు విలువలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని తల్లిదండ్రులకు సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్ గ్రామసభలు

సత్తుపల్లిటౌన్, డిసెంబర్16: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై సోమవారం మండలంలోని గంగారం, బేతుపల్లి, కిష్టాపురం, యాతాలకుంట, తాళ్లమడ, రేజర్ల గ్రామాల్లో సోషల్‌ఆడిట్ గ్రామసభలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చిన్ననాగేశ్వరరావు, ఎంఈవో నక్కా రాజేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ ఏపీవో బాబురావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 16: విద్యారంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమంలో విద్యార్థులంతా పాల్గొని విజయవంతం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ పిలుపునిచ్చారు. చలో అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా బృందం సోమవారం బయలుదేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు యశ్వంత్, నసీర్, రఘు, వెంకటేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

22న ఆటో మోటర్ వర్కర్స్ యూనియన్ మహాసభలు

కొణిజర్ల, డిసెంబర్ 16: ఆటో మోటర్ వర్కర్స్ యూనియన్ రెండో మహాసభలు ఈనెల 22న దొడ్డి కొమరయ్యహాల్ బాగ్‌లింగంపల్లి హైదరాబాద్‌లో జరుగుతాయని, కార్మికులు పాల్గొనాలని జయప్రదం చేయాలని కోరారు. సోమవారం మండలంలోని ఎల్లన్ననగర్‌లో నాయకులు ఆలకుంట బలరాం మహాసభల గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమం లో గొలుసుల రాజు, సారయ్య, వీరయ్య, వెంకన్న, కృష్ణ, రమేశ్, ప్రశాంత్, రమేశ్, జనార్దన్, శ్రీను పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దు

వైరాటౌన్, డిసెంబర్ 16: రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని సీపీఐ, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సీపీఐ, రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం సొసైటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం రైతులతో కలిసి మార్కెట్‌లో వరి ధాన్యాన్ని సందర్శించారు. మార్కెట్‌లో తేమ శాతం తక్కువగా ఉన్న వద్ద రైతులకు కూపన్‌లను వెంటనే ఇచ్చి కాంటాలు అయ్యేవిధంగా చూడాలని వ్యవసాయ శాఖ అధికారి నర్సింహారావును కోరారు. జాగర్లమూడి రంజిత్‌కుమార్, అమరనేని వీరభద్రం, మాదినేని వెంకన్న, బోగినబోయిన నాగేశ్వరరావు, బసవయ్య, కొమ్మినేని నర్సింహారావు, రమేష్, చార్జిరావు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న లైన్‌మెన్

దొరికిన మొబైల్‌ను అప్పగిస్తున్న శ్రీనివాసరావు

వైరాటౌన్, డిసెంబర్16: వైరా టౌన్ లైన్‌మెన్ కర్లకంటి శ్రీనివాసరావు విధి నిర్వహణలో ఉండగా సాయంత్రం నాలుగు గంటల సమయంలో బ్రాహ్మణపల్లి సమీపంలో మొబైల్ రోడ్డు ప్రక్కన పడి ఉంది. దానిని గమనించి ఆ మొబైల్‌ను తీసుకొని సంబధిత వారికి ఫోన్ చేసి అడ్రస్ తెలుసుకొని వారికి వైరా పోలీసుల సమక్షంలో అందజేశారు. లైన్‌మెన్ శ్రీనివాసరావు నిజాయితీని చాటుకోవడంతో అందరూ అభినందించారు.

'విద్యార్థులు ఇష్టమైనది కాదు.. కష్టమైనది ముందు చదవాలి'

సత్తుపల్లి, డిసెంబర్ 16: పదోతరగతి విద్యార్థులు ఇష్టమైనదే ముందు చదివితే కష్టమైన సబ్జెక్టులో ఉత్తీర్ణత సాధించలేరని, ముందు ఇష్టమైనది కాకుండా కష్టమైనది చదవాలని ఏఎంవో రవికుమార్ అన్నారు. సోమవారం మండలంలోని గంగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. శ్రద్ధగా వినడం, ఇంటి వద్ద దానిని గుర్తు పెట్టుకోవడంతోనే మంచి మార్కులు వస్తాయన్నారు. ఎంత బాగా రాయడం ప్రాక్టీస్ చేస్తే అంత ఉన్నతంగా పరీక్షల్లో రాణిస్తారని తెలిపారు. వంద శాతం ఉత్తీర్ణత కోసం ఈ రెండు నెలలు కీలకమన్నారు. హెచ్ఎం జయరాజు, ఉపాధ్యాయులు విద్యార్థుల శ్రేయస్సు కాంక్షిస్తూ ఉదయం, సాయంత్రం వారి సహకారంతో అల్పాహారం అందిస్తున్నారన్నారు.

సర్వశిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

వేంసూరు, డిసెంబర్16: ఎన్నో సంవత్సరాలుగా గౌరవ వేతనంతో రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా పనిచేస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయులను, ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేసి టైంస్కేల్ ఇవ్వాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం మండల క్యాంపెయిన్‌లో భాగంగా మండల శాఖ బాధ్యులతో పాల్గొని నాగేశ్వరరావు మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జీ రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి కే శ్రీకాంత్, మండల బాధ్యులు కొత్త శ్రీనివాస్, ఫకీర్, పాల్గొన్నారు.

సైదేశ్వరరావుకు నివాళి

మధిర (చింతకాని), డిసెంబర్ 16: చింతకాని మండలంలోని ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన రైతుబంధు మాజీ కన్వీనర్, బీఆర్ఎస్ నాయకుడు పెండ్యాల సైదేశ్వరరావు ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు సోమవారం ప్రొద్దుటూరులోని మృతుడి ఇంటికెళ్లి సైదేశ్వరరావు చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య, నాయకులు మంకెన రమేశ్, దామోదర్, వివిధ పార్టీల నాయకులు సైదేశ్వరరావు నివాళి అర్పించి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలి

తిరుమలాయపాలెం, డిసెంబర్ 15: విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన మండలంలోని సుబ్లేడు వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఉపసర్పంచ్, కాంగ్రెస్ నాయకుడు బత్తుల వెంకటనారాయణ ఫిర్యాదు చేశారు. తన భార్య రాధమ్మకు కాలుకు గాయమై సుబ్లేడు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తే వైద్యాధికారి నిర్లక్ష్యం వహించడంతో పాటు హేళన చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆది నుంచి మహిళలను బలహీనులుగా చిత్రీకరించారు

వైరాటౌన్, డిసెంబర్ 16: ఆది నుంచి మహిళలను బలహీనులుగా చిత్రీకరించారని వైరా మాజీ ఎంపీపీ, స్టడీ సర్కిల్ కన్వీనర్ బొంతు సమత అన్నారు. సోమవారం వైరా సీపీఎం కార్యాలయంలో జరిగిన స్టడీ సర్కిల్‌లో మహిళలపై జరుగుతునన హింసపై సమత మాట్లాడుతూ.. మహిళలు పురుషులపై ఆధారపడి జీవించే విధంగా వ్యవస్థీకృతమైందన్నారు. కార్యక్రమంలో బొంతు రాంబాబు, పారుపల్లి చంద్రశేఖర్‌బాబు, పారుపల్లి కృష్ణారావు, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, చింతనిప్పు చలపతిరావు, వడ్లమూడి మధు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సేవలు ఎనలేనివి

రఘునాథపాలెం, డిసెంబర్16: మండలంలోని వీ వెంకటాయపాలెం ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎంగా పని చేసిన వేమిశెట్టి మోహన్‌దాస్, ఉపాధ్యాయులు రాయల నర్సింహారావు, నల్లమల నర్మదల సేవలు ఎనలేనివని మాజీ ఎంపీటీసీ యరగర్ల హనుమంతరావు పేర్కొన్నారు. ఉపాధ్యాయులు నర్సింహారావు, నర్మద బదిలీపై వెళ్తున్న సందర్భంగా సోమవారం వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీమన్నారాయణ, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు తొలుపునూరి దానయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పిల్లలతో ధర్నాలో పాల్గొన్న ఉద్యోగులు

ఖమ్మం ఎడ్యుకేషన్, డిసెంబర్ 16: సమగ్ర శిక్ష అభియాన్ పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగులు తమను రెగ్యులరైజ్ చేయాలని చేస్తున్న సమ్మె సోమవారానికి ఏడోవ రోజుకి చేరుకుంది. సోమవారం సమ్మెలో ఉద్యోగుల కుటుంబ సభ్యులతో పాటు పిల్లలు పాల్గొన్నారు. చెవిలో పూలు పెట్టుకుని తమన నిరసనను తెలిపారు. పలు సంఘాలకు చెందిన బాధ్యులు శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు.